## క్లుప్తంగా

### వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెదపూడి: సంపర వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు అధ్వర్యంలో స్వామికి విశేష అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

### నేడు వేణుగోపాలస్వామి వార్షికోత్సవం

బిక్కవోలు: తొస్సిపూడి గ్రామంలోని ఆదివారం జరగనున్న శ్రీరుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి తృతీయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఆదివారం ఆలయం వద్ద స్వామివారి కల్యాణం, అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

### వేసవి దుక్కులు ముమ్మరం



గుమ్ములూరులో ట్రాక్టర్‌తో దుక్కు చేస్తున్న రైతు

మధురపూడి: మెట్ట ప్రాంతమైన కోరుకొండ మండలంలో వేసవి దుక్కులు జోరుగా సాగుతున్నాయి. రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. సాగుకు భూమిని సదును చేసుకుంటున్నారు. ఈ దుక్కులు వల్ల గడ్డి, సాగుకు కీడు చేసే పురుగులు నశిస్తాయి. దీనివల్ల పంటకు సారవంతమైన నేల లభిస్తుంది. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 6,041 హెక్టార్లలో సాగు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

### క్రికెట్ టోర్నీ విజేత సుభద్రంపేట



విజేతకు కప్ అందిస్తున్న దండయ్య కుటుంబ సభ్యులు

రంగంపేట: మండల పరిధిలోని సుభద్రంపేటలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో స్థానిక జట్టు విజేతగా నిలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. మొత్తం 64 టీమ్‌లు పాల్గొన్న ఈ టోర్నీలో ఫైనల్‌కు సుభద్రంపేట, ఆనూరు జట్లు చేరుకోగా సుభద్రంపేట విన్నర్‌గా, ఆనూరు రన్నర్‌గా నిలిచాయి. విన్నర్ జట్టుకు పేపకాయల దండయ్య కుటుంబ సభ్యులు రూ.20 వేల ప్రైజ్ మనీ, ట్రోఫీని అందించారు. రన్నర్ జట్టుకు మైలవరపు అనంత పద్మనాభరావు కుటుంబ సభ్యులు రూ.10 వేల ప్రైజ్‌మనీ, ట్రోఫీని అందజేశారు.

### అతిసార నివారణపై అవగాహన



అతిసారంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గోకవరం: అతిసార వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గోకవరం వైద్య సిబ్బంది సూచించారు. స్థానిక సంజీవయ్యనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అతిసార నియంత్రణ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల్లో అతిసార వ్యాధి ప్రబలకుండా విరోచనాలు అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఓఆర్ఎస్ ద్రావణం వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మౌనిక, బేబి, పవన్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

### బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

పెదపూడి: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల వెంకట్రావు అన్నారు. జి.మామిడాడలో తొమ్మిదేళ్ల బీజేపీ పాలనపై నియోజకవర్గ స్థాయి సంయుక్త మోర్చాల సమావేశం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గ కన్వీనర్ శివరామకృష్ణంరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గుర్రాల వెంకట్రావు మాట్లాడుతూ యువ మోర్చా, కిసాన్, మహిళా, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మోర్చాలు బీజేపీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నమామి గంగా ప్రముఖ్ మురముళ్ల వెంకటరమణ, టి.వెంకటేశ్వరరావు, కె. సత్యనారాయణ, జి.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి

కంబాలచెరువు: స్థానిక కంబాలచెరువు ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి శనివారం మృతి చెందాడు. అతని వయస్సు 50 నుంచి 55 సంవత్సరాలు ఉంటుంది. తెలుపురంగు షర్టు, ఆకుపచ్చ నిక్కరు ధరించి ఉన్నాడు. స్థానికులు మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

# పల్లె ముంగిటకు వైద్య సేవలు

- ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వ భరోసా
- వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లపై ప్రజల హర్షం

రంగంపేట: ఆరోగ్యమే మహాభాగ్యం నానుడితో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలను అందించేందుకు శ్రీకారం చుట్టింది. కొద్దిపాటి అనారోగ్యానికి, చిన్న, చిన్న వైద్య సమస్యలకు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన అగత్యం లేకుండా గ్రామీణులకు కూతవేటు దూరంలోనే వైద్య సేవలు అందించేందుకు హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు(వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు) అందుబాటులోకి తీసుకొచ్చింది. గ్రామం నుంచి ఒకటి, రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్‌సీ) లేదా సామాజిక ఆసుపత్రి (సీహెచ్‌సీ)కి వెళ్లనవసరం లేకుండా ప్రాథమికంగా గ్రామంలోనే వైద్య సేవలు, వైద్య పరీక్షలు పొందేందుకు వీలుగా హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. గ్రామాల్లో ఉండే వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు చేసి ఈ సెంటర్ల ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.

రంగంపేట మండలంలో 19 గ్రామ సచివాలయాల పరిధిలో 19 హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే కోటపాడు గ్రామంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

**ఉచితంగా 105 రకాల మందులు**

- సుమారు 2 వేల నుంచి 3 వేల జనాభా కలిగిన ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఉంటుంది. సెంటర్‌లో 24 గంటలు వైద్య సేవలు అందించేందుకు మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ), గ్రామ సచివాలయ ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉంటారు.
- హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయి. అలాగే షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు చేసేందుకు అత్యాధునిక వైద్య కిట్లు ఏర్పాటు చేశారు.
- హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల భవనాలు పూర్తి కాని చోట్ల గ్రామ సచివాలయాల్లో, అద్దె భవనాల్లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వృద్ధులు, గర్భిణులకు నిరంతరం వైద్య బృందం అందుబాటులో ఉంటూ వైద్య సేవలందిస్తున్నారు.
- పీఎంపీ, ఆర్ఎంపీ, ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించకుండా నేరుగా హెల్త్ వెల్‌నెస్ సెంటర్లకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందొచ్చు. అలాగే సెంటర్‌కు వచ్చే రోగులను ఎంఎల్‌హెచ్‌పీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వారి ఆరోగ్యం మెరుగుపడే వరకు వైద్య సూచనలు, సలహాలు ఇస్తున్నారు.
- ఆయా సెంటర్ల పరిధిలో ప్రతి నెలలో రెండు పర్యాయాలు ప్రభుత్వం నియమించిన వైద్యులు 104 వాహనం ద్వారా వచ్చి వైద్య సేవలు అందిస్తారు. వైద్యులు సూచించిన వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందిస్తారు.
- హెల్త్ వెల్‌నెస్ సెంటర్ పరిధిలో ఆరోగ్యశ్రీ, శస్త్ర చికిత్స చేయించుకున్న రోగులను, పక్షవాతం, ఇతర రోగాలతో మంచానికి పరిమితమై కేంద్రాల వద్దకు రాలేని పరిస్థితిలో ఉన్న రోగులను పరీక్షించేందుకు ఇంటింటికీ వెళ్లి వైద్యులు సేవలు అందిస్తున్నారు.




కోటపాడులో నిర్మాణం పూర్తి చేసుకున్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్ (వైఎస్సార్ విలేజ్ క్లినిక్)

**రంగంపేట మండలంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల వివరాలు**

| | |
|---|---|
| వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు | 19 |
| మొత్తం వైద్య సిబ్బంది | 2 మంది |
| రోజూ సేవలందుకుంటున్న రోగులు | 200 మంది |
| ఉచితంగా చేస్తున్న వైద్య పరీక్షలు | 14 రకాలు |



గ్రామాల్లో ప్రజలకు అందుతున్న వైద్యసేవలు

**అందుబాటులో వైద్య సేవలు**



హెల్త్ వెల్‌నెస్ సెంటర్(వైఎస్సార్ విలేజ్ క్లినిక్)కు వచ్చే రోగులకు ప్రాథమిక వైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆరోగ్య సిబ్బందిని నియమించింది. 105 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు చేస్తారు.

– డి.లావణ్య, వైద్యాధికారిణి, రంగంపేట, పీహెచ్‌సీ

**మెరుగైన వైద్యం కోసమే ఏర్పాటు**



హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు(వైఎస్సార్ విలేజ్ క్లినిక్) గ్రామీణ వైద్యాలయాలుగా పేరు పొందాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించేందుకు వీటిని ఏర్పాటు చేశారు. మండలంలోని కోటపాడులో వెల్‌నెస్ సెంటర్ భవనం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. మిగతా గ్రామాల్లోని సెంటర్‌ల భవనాలు కూడా నిర్మాణాలు పూర్తవుతున్నాయి.

– పేపకాయల రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు, రంగంపేట మండలం

### అటవీశాఖ సెక్షన్ అధికారి భూపాల్ మృతి

గోకవరం: మండలంలోని ఫోక్స్‌పేట రేంజ్ పరిధిలోని మొల్లేరు అటవీ సెక్షన్ అధికారిగా పని చేస్తున్న ఏలూరి భూపాల్ (58) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. 1988లో అటవీశాఖలో అసిస్టెంట్ బీట్ ఆఫీసర్‌గా విధుల్లో చేరిన ఆయన 34 ఏళ్ల సర్వీసులో పలు చోట్ల సేవలందించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం గోకవరంలోని ఇంటి వద్ద మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న రేంజర్ ఎం.కరుణాకర్, సిబ్బంది ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ సాయంగా అంత్యక్రియల కోసం రూ.25 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రైటర్ గీత, సహచర సిబ్బంది వెంకట్రావు, నూకరాజుదొర, అప్పారావు, ప్రశాంతకుమార్, జగదీష్, మనోహర్, సుభద్ర, డీఈఓ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

### సారాతో వ్యక్తి అరెస్టు



అరెస్టు చేసిన నిందితుడితో ఎస్ఈబీ సీఐ సత్యనారాయణ

సీతానగరం: సారాతో వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ జి.సత్యనారాయణ శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తమకు అందిన సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి సింగవరానికి చెందిన మార్గాని దొరబాబును 20 లీటర్ల సారాతో అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

## జగనన్న పాలన దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ముగ్గళ్లలో గడప గడపకూ మన ప్రభుత్వం

సీతానగరం: ప్రజల సంక్షేమం కోసం నవరత్నాలు పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శనివారం ముగ్గళ్ళ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించి, ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యమవుతుందన్నారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యుదయానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అన్ని పథకాలు ప్రజలకు చేరవేసేందుకే ఈ గడప గడపకూ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. జగన్ పాలనపై ప్రతి కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తోందన్నారు. ఏ ఇంటికి వెళ్లినా జేజేలు పలుకుతున్నారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరి బాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, వైస్ఎంపీపీ-2 సత్యం మదన్‌బాబు, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ సభ్యులు సాదె చంటి బాబు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, సుంకవల్లి సుబ్రహ్మణ్యం, మన్యం నాని, బొమ్ముల రాంబాబు, కూచిపూడి బాబ్జి, కోటేశ్వరరావు, స్వామి, అధికారులు పాల్గొన్నారు



ముగ్గళ్లలో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

## ప్రతి ఇంటికీ గోదావరి జలాలు

- ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- నరేంద్రపురంలో ఓహెచ్ఆర్ ప్రారంభం

రాజానగరం: నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ గోదావరి జలాలను పైపులైన్ల ద్వారా అందించే ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.215 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టామన్నారు. మండలంలోని నరేంద్రపురంలో రూ.1.20 కోట్లతో నిర్మించిన 1.20 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంక్( ఓహెచ్ఆర్)ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 75 ఓహెచ్ఆర్‌లు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటికే 42 పూర్తయ్యాయని, మరో 17 నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. మిగిలిన 16 ఓహెచ్ఆర్‌ల నిర్మాణ పనులు కూడా త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. ఈ పనులన్నీ పూర్తయితే నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ పైపులైన్ల ద్వారా గోదావరి జలాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, ఎంపీటీసీ సభ్యురాలు తంగెళ్ల చిలకమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, సొసైటీ చైర్‌పర్సన్ పబ్బన శ్రీనివాస్, నాయకులు ప్రగడ శివన్నారాయణ, ప్రగడ రాంబాబు, ప్రగడ చక్రీ, తంగెళ్ల వెంకట్రావు, వీరరాఘవులు, బేదంపూడి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



నరేంద్రపురంలో ఓహెచ్ఆర్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజా

## ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



క్షీరాభిషేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: మండలంలోని కుతుకులూరులో పార్వతీ సమేత కూటేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం పెదపర్తికి చెందిన శివాచార్య యలమంచిలి కృష్ణమూర్తి నేతృత్వంలో ఎమ్మెల్యే దంపతులు స్వామికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్మించే మండపానికి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి, రాజ్యలక్ష్మి దంపతులు భూమి పూజ చేశారు. సుమారు రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టిన ఆలయ పునఃనిర్మాణానికి గాను ఎమ్మెల్యే కృషితో దేవదాయ ధర్మాదాయశాఖ రూ.కోటి మంజూరు చేసింది. దీనికి తోడు దాతల సహకారంతో ఆలయాన్ని పునఃనిర్మించనున్నారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, సర్పంచ్ గొల్లు హేమతులసి సురేష్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



అచ్యుతాపురం రామాలయంలో ప్రతిష్ఠించిన దేవతామూర్తుల విగ్రహాలు

**ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం**

గోకవరం: మండలంలోని అచ్యుతాపురంలో నూతనంగా నిర్మించిన పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రారంభోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయంలో సీతారాములు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహాలతో పాలు పలు దేవతల విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. వేద పండితులు వి.శ్రీమన్నారాయణాచార్యులు, కల్యాణ చక్రవర్తి, ఎస్‌టీపీ శ్రీనివాసచార్యులు, కృష్ణమాచార్యులు తదితరులు ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో భారీ అన్నదానం నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

## అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై ఉద్రిక్తత

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెంలో అనుమతులు లేకుండా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడంపై ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే.. తిరుమలాయపాలెం పంచాయతీ కార్యాలయం సెంటర్‌లోని ప్రధాన రహదారి పక్కన ఖాళీ స్థలంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఓ వర్గం అనుమతి లేకుండా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. అనుమతి లేకుండా విగ్రహం ఏర్పాటు చేయడంపై మరో వర్గం ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. గత బుధవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై గ్రామానికి చెందిన అంబేడ్కర్ యూత్ సభ్యులు ఆందోళన నిర్వహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి గ్రామంలో వివాదం నెలకొంది. ఈ క్రమంలో గ్రామంలో అనుమతులు లేకుండా విగ్రహం ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ శనివారం మరో వర్గం ఆందోళనకు దిగింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు, కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనుమతులు లేకుండా రాత్రి సమయంలో విగ్రహం ఏర్పాటు చేయడం సరికాదని, స్వచ్ఛందంగా విగ్రహాన్ని తొలగించి సహకరించాలని సూచించారు. దీనికి వారు ససేమీరా అనడంతో ఇరు వర్గాల వారితో అధికారులు సమావేశం నిర్వహించారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.



తిరుమలాయపాలెంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన వారితో మాట్లాడుతున్న తహసీల్దార్, డీఎస్పీ, సీఐలు

### ఈ రావిచెట్టుకు 85 ఏళ్లు



దోసకాయలపల్లి నందిబొమ్మ సెంటర్‌లోని రావిచెట్టు

మధురపూడి: ఈ ఫొటోలో కనిపిస్తున్న రావిచెట్టుకు 80 ఏళ్లు. ఈ చెట్టు కోరుకొండ మండలం దోసకాయలపల్లి శివాలయం, నందిబొమ్మ, గ్రంథాలయం సెంటర్‌లో ఉంది. ఇన్నేళ్లుగా ఎంతో మందికి నీడనిచ్చింది. స్వచ్ఛమైన గాలిని అందించింది. గ్రామస్తులు ఈ చెట్టు చుట్టూ సిమెంట్ మండపం నిర్మించి, అందరూ కూర్చోవడానికి అనువుగా తీర్చిదిద్దారు. 75 సంవత్సరాలుగా ఇక్కడ చర్చవేదికలు జరుగుతున్నాయి.

## 13న వీరభద్రస్వామికి వార్షిక కల్యాణం

పెదపూడి: పుట్టకొండలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పదో వార్షిక దివ్య కల్యాణం ఈ నెల 13న నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త, ఆలయ కమిటీ చైర్మన్ వల్లు సత్యనారాయణ తెలిపారు. శనివారం ఉదయం 8.10 గంటలకు ఆలయంలో స్వామి కల్యాణానికి సంబంధించిన రాట ముహూర్తం గ్రామ సర్పంచ్ వల్లు వెంకటరమణ చేతుల మీదుగా చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు పి.కమలాకర్ మాట్లాడుతూ 13న స్వామివారికి పంచామృతాభిషేకం, గణపతి పూజ, పంచగవ్య ప్రాసన, ధ్వజారోహణ, రథోత్సవం, అన్నదానం నిర్వహిస్తామన్నారు. భక్తులందరూ అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకోవాలని కోరారు.



స్వామివారి కల్యాణానికి రాట ముహూర్తం చేస్తున్న సర్పంచ్ వెంకటరమణ తదితరులు

### నిత్యావసర సరకులు అందజేత



బాధితులకు నిత్యావసర సరకులు అందిస్తున్న నాయకులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో జక్కంపూడి రామ్మోహన్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల పలు కారణాలతో మరణించిన వారి కుటుంబ సభ్యులకు నిత్యావసర సరకులను వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా అందజేశారు. శనివారం సీతానగరంలో నాలుగు కుటుంబాలకు జక్కంపూడి రామ్మోహన్‌రావు ఫౌండేషన్ అక్షయ సంజీవిని కార్యక్రమంలో ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం, రూ.రెండు వేల విలువ చేసే నిత్యావసర సరకుల కిట్ల అందజేశారు.

## ఆటో బోల్తా పడి నలుగురికి తీవ్ర గాయాలు

సీతానగరం: మండలంలోని రాపాక – కోటికేశవరం రోడ్డులో అదుపుతప్పి ఆటో బోల్తా పడగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం కోరుకొండ మండలం గుమ్ములూరుకు చెందిన పది మంది ఆటోలో దేవీపట్నం మండలం గండి వద్ద వివాహ కార్యక్రమానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రాపాక మెట్ట గంగాలమ్మ అమ్మవారి ఆలయం దగ్గరకు వచ్చేసరికి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటో ఉన్న కోరుమిల్లి పద్మ, కోరుమిల్లి వీరపాప, మడికి రాఘవలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ మద్దా నానికి స్వల్ప గాయాలయ్యాయి.

## కంప్యూటర్, టైలరింగ్, మగ్గం కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్, మగ్గం, టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు శనివారం తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి కంప్యూటర్ కోర్సు చేరేవారు ఇంటర్ పాసై ఉండాలన్నారు. ఇతర కోర్సుల్లో చేరేవారు కనీసం పదో తరగతి పాసై ఉండాలన్నారు. జూన్ 15 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. 45 రోజుల పాటు జరిగే ఈశిక్షణలో మెటీరియల్ అలాగే మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తారన్నారు. శిక్షణ అనంతరం ఉత్తీర్ణత పత్రాలను అందిస్తామని రాంబాబు తెలిపారు. కంప్యూటర్ కోర్సులో చేరేవారు 8125686494, టైలరింగ్ బ్యూటిషన్ కోర్సుల కోసం ఫోన్ 9849847489 నంబర్లలో సంప్రదించాలన్నారు. స్వయంగా సంప్రదించాలి అనుకునే వాళ్ళు లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి రావాలని కోరారు.

## ప్రతి డివిజన్‌లో వైఎస్సార్ సీపీ కార్యాలయం

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని 42 డివిజన్లలో వైఎస్సార్ సీపీ కార్యాలయాలు ప్రారంభించి నెలకో డివిజన్‌లో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. శనివారం నగరంలోని 37వ డివిజన్‌లో లలితా నగర్ వినాయకుని గుడి వద్ద వైఎస్సార్ సీపీ డివిజన్ కార్యాలయాన్ని ఎంపీ భరత్ రామ్, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ నగరంలో ప్రతి డివిజన్‌లో పార్టీ కార్యాలయాలను ఆయా డివిజన్ల ఇన్‌చార్జుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. నగరంలో ప్రథమంగా 37వ డివిజన్‌లో గుడిమెట్ల బాలాజీ రెడ్డి ఔదార్యంతో సబ్బారపు సూరిబాబు, సుందర్ సింగ్ ఆధ్వర్యంలో కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి నెలా నిర్వహించే రచ్చబండకు గ్రామ సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలన్నారు.



37వ డివిజన్‌లో పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న ఎంపీ భరత్‌రామ్

### ముగిసిన బాస్కెట్‌బాల్ శిక్షణ

ప్రకాశం నగర్: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దానవాయిపేట మున్సిపల్ హైస్కూలోని బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో ఈ గత నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన బాస్కెట్ బాల్ వేసవి శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ బి. సుధారాణి, ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ పెంకే సురేష్, జిల్లా చీఫ్ కోచ్ డీఎంఎం శేషగిరి, వైఎస్సార్ సీపీ 6వ డివిజన్ ఇన్‌చార్జు బూరిడి త్రిమూర్తులు, 38వ డివిజన్ ఇన్‌చార్జు సత్తిబాబులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బాస్కెట్ బాల్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రం, జ్ఞాపికాలను అందజేశారు.